


లాడ్జీ, రిసార్ట్స్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రముఖ పర్యాటక కేంద్రమైన మండల కేంద్రంలోని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు లాడ్జిలు, రిసార్ట్స్,హెూటల్స్ విస్తతంగా తనిఖీ నిర్వహించారు.దొంగతనాలు, మద్యం సేవించి డీజే సౌండ్స్, గొడవలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని లాడ్జిల నిర్వాహకులకు సూచించారు. ఎవరైనా మద్యం సేవించి గొడవ చేస్తే అరకు పోలీసు స్టేషన్ కి తెలియపరచాలని చెప్పారు. అరకులోయ మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ఎక్కడికి అక్కడే పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సిఐ చెప్పారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సిఐ

పర్యాటక ప్రాంతాలు కిటకిట

▸▸దేశ, విదేశాల నుంచి తరలి వచ్చిన పర్యాటకులు ▸▸ వలిసె తోటల్లో విహారం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ఆంధ్రా ఊటీ అరకులోయలో పర్యాటక సందర్శక ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఓవైపు మంచు అందాలను ఆస్వాదిస్తూ, మరోవైపు ఫొటోలు తీసుకుంటూ పర్యాటకులు ఉల్లాసంగా గడిపారు. దేశ, విదేశాల నుండి పర్యాటకులు శనివారం సాయంత్రానికే అరకులోయకు చేరుకుని గుడారాలు, లాడ్జీల్లో రాత్రి బసచేసి ఉదయాన్నే మంచు అందాలను ఆస్వాదించారు. పద్మాపురం గార్డెన్, అరకులోయ గిరిజన మ్యూజియం, బొర్రా గుహలకు, డుంబ్రిగుడ చాపరాయిలో సందడి చేశారు. వలిసే పూల తోటల్లో ఫోటోలు తీసుకుంటూ అందాలని తిలకించారు. మండల కేంద్రంలోని మ్యూజియం, కళాగ్రామంలో ఉన్న జిప్‌లైన్, స్కై సైకిలింగ్ పిల్లలు, యువకులు చేస్తుండగా వారిని తల్లిదండ్రులు, బంధువులు ఉత్సాహ పరిచారు. కళాగ్రామంలో యంపీ థియేటర్ వేదికపై పర్యాటకుల కోసం థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. పద్మాపురం గార్డెన్‌లో పర్యాటకులు ట్రాయ్‌ట్రెన్‌లో విహరిస్తూ అందాలను తిలకించారు. మాడగడ కొండపైన మంచు అందాల ఫొటోలు తీసుకుని అందాలను ఆస్వాదించారు.



అనంతగిరి మండల తాటిగుడ జలపాతం వద్ద పర్యాటకులు



అనంతగిరిలోని బొర్రా గుహల వద్ద పర్యాటకులు



అరకులోయలో వలిసె తోటలో పర్యాటకులు

బొర్రా గుహల్లో సందడి

అనంతగిరి:కార్తీక మాసం మూడో వారం కావడంతో ఆదివారం ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు వేలాది మంది పర్యాటకులు తరలి వచ్చారు. బొర్రా ప్రాంతమంతా సందడి నెలకొంది. వాహనాలు నిలిపివేతకు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో కొన్ని వాహనాలు ప్రధాన రహదారిపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది.డముకు యూ పాయింట్, చిట్టంపాడు, కటికి, తాడిగుడను సందర్శించారు. కాఫీ ప్లాంటేషన్, సుంకరమెట్ట యు ఫాయింట్‌లను తిలకించారు.దీంతో అనంతగిరి, అరకు ఘాట్ రోడ్ పర్యాటకులతో సందడి నెలకొంది.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

విఒఎల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు

వెలుగు డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న విఒఎలకు 10 నుండి 15 నెలల పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. 3 సంవత్సరాలు పని చేసిన విఒఎలను ఇంటికి పంపించే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చి కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. ఆదివారం చింతూరులో జరిగిన వెలుగు యానిమేటర్స్ (విఒఎ)ల మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విఒఎల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. 9 నుండి 15లోపు గ్రూప్‌లు వున్న విఒఎలకు వేతనాలు నిలుపుదల చేసిందని, కాని జీతాలు ఇవ్వకుండా వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. ప్రతి మండలంలో 25 శాతం విఒఎలు జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇచ్చిన వేతనాలు కూడా చాలా తక్కువ అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 3 ఏళ్ళ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, కనీసం వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూప్‌ల సంఖ్యతో నిమిత్తం లేకుండా అందరికి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని 12 మందితో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రత్నకుమారి, లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, లీలా, సుహాసిని, వాణి, జయలక్ష్మి, రాధ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పోస్టులకు ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులకు మండలంలోని నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు తమ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్సైలు గోపి నరేంద్ర ప్రసాద్, షరీఫ్ ఆదివారం సూచించారు. గత నెల 27 నుండి ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, ఏఆర్ఎస్ పోస్టులకు యువకులు 162.5 సెంటీమీటర్లు, యువతులు 150 సెంటీమీటర్లు ఎత్తు ఉండి 18 నుంచి 28 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులకు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఐటిడిఎ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత భోజనం వసతితో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు.

అల్లూరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో..

15 మంది ప్రత్యేక వైద్య నిపుణులు

సూపరింటెండెంట్ కృష్ణారావు

ప్రజాశక్తి పాడేరు:- అల్లూరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 15 మంది ప్రత్యేక వైద్య నిపుణులు భర్తీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఈఎన్టీ వైద్య నిపుణులు కే.కృష్ణారావు వెల్లడించారు ఈ వైద్య నిపుణుల నియామకంతో పాడేరు జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య సేవల విస్తరణపై తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే...

ప్రస్తుతం ఉన్న వైద్య నిపుణులు?

పిల్లల వైద్య నిపుణులు (పీడియాట్రిస్ట్), గైనకాలజిస్ట్, ఈఎన్‌టి, జనరల్ సర్జన్, ఎనస్తీసియా, కంటి వైద్య, మానసిక వైద్య నిపుణులు, పెథాలజిస్ట్, ఆర్థోపెడిక్ మైక్రోబయాలజిస్ట్ ఉన్నారు.

అందుబాటులో ఉన్న ఆపరేషన్లు

గతంలో గర్భిణీలకు శస్త్ర చికిత్సల కోసం, గాయపడిన వారికి ఎముకలు విరిగిన వారికి ఆపరేషన్ల కొరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫరల్ కేసులు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో వైద్య నిపుణులు నియామకంతో ఆపరేషన్లు నిర్వహించడానికి సౌలభ్యం కలిగింది. ముఖ్యంగా ఆర్థో, గైనిక్, కంటి సమస్యలకు సంబంధించి క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాము. ప్రస్తుతం ఆసుపత్రిలో రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీ ఉంది. రేడియాలజిస్ట్ భర్తీ అయితే గైనిక్ శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.



వినికిడి పరికరాలు ఉన్నాయా

అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ద్వారా 16 లక్షల రూపాయలు వెచ్చించి ఈ ఆస్పత్రికి వినికిడి పరికరాలు అందుబాటులోకి తెచ్చాం. దీని ద్వారా ఇక నుంచి సదరం క్యాంపుల నిర్వహణకు దోహదం కలుగుతుంది. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల నిర్వహణ కోసం ఐదు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. రోజు ఆసుపత్రికి 300 నుంచి 500 వరకు ఓపి ఉంటుంది. జిల్లా కలెక్టర్కు ప్రతిపాదించి ఓపి విభాగం ఛాంబర్‌లను అదనంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఆసుపత్రిలో రోగులకు 200 పడకలు అందుబాటులో ఉన్నాయి.





సులాబ్ కాంప్లెక్స్‌కు వేసివున్న తాళాలు

నిరుపయోగంగా సులాబ్ కాంప్లెక్స్

మరుగుదొడ్లు లేక పర్యాటకులు ఇబ్బందులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో లక్షలాధి రూపాయలు వెచ్చించి నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా దర్శనమిస్తుంది. మరుగుదొడ్లు ఉన్నపట్టికీ నిరుపయోగంగా ఉండటంతో పర్యాటకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబేద్కర్ జంక్షన్ నుండి ఆర్అండ్‌బి అతిథి గృహంకు వెళ్లే దారిలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో స్థానికులు మండిపడుతున్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద ప్రజా మరుగుదొడ్లు అని బోర్డు పెట్టడంతో పర్యాటకులు, స్థానికులు వెళ్లి చూసే సరికి గేలు తాళాలు వేసి ఉండటంతో వెను తిరుగుతున్నారు.

ఇటీవల కాలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి మరుమ్మతులు చేశామని పంచాయితీ అధికారాలు చెబుతున్నప్పటికీ అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేక పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో పర్యాటకుల సీజన్ కావడంతో దేశ విదేశాల నుండి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఇప్పటికైనా పంచాచతీ అధికారులు, ఐటీడీఏ అధికారులు స్పందించి సులబ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

కలెక్టర్ ఆదేశంతో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రానికి కూత వేటు దూరంలో అటవీ శాఖ కార్యాలయం సమీపంలోని కుమడ వెళ్లే మార్గంలో రహదారి పక్కన పేరుకు పోయిన చెత్తను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈవోపిఆర్డి వి.చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శి గోపి, స్థానిక సర్పంచ్ ఎస్.సుభాష్ చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం జెసిబి సహాయంతో తొలగించారు. నెలల తరబడి రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లేది. పంచాయతీ అధికారులు మాత్రం ఇన్నాళ్లు చెత్తను తొలగించేందుకు దృష్టి సారించ లేదు. శనివారం మండలంలో పర్యటించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ముంచంగిపుట్టు నుండి బూసిపుట్ వెళ్లే క్రమంలో అటవీశాఖ కార్యాలయం ఎదుట పేరుకు పోయిన చెత్తను పరిశీలించారు. వెంటనే చెత్తను తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశించడంతో ఆదివారం ఆగమేగాలతో జెసిపి సహాయంతో చెత్తను తొలగించారు.



చెత్తను తొలగింపు చర్యలు చేపడుతున్న అధికారులు

మేమేమి పాపం చేశాం..?

పోలవరం పరిహారం జాబితాలో చేర్చకపోవడంపై వృత్తిదారులు, చిరువ్యాపారుల ఆవేదన

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న బాధితులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పిన పాలకులు, ఆచరణలో నిర్వాసితుల గుర్తింపు, పరిహారం చెల్లింపు దగ్గరకు వచ్చేసరికి చాలా మందికి తీరని అన్యాయం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి పలు వృత్తులు చేసుకొని జీవిస్తున్న వారిని నిర్వాసితులుగా గుర్తించడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. చింతూరు మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి గోడకు ఆనుకొని ఉన్న ప్రధాన రహదారి పక్కన చిన్న బడ్డీ కోట్టులు ఏర్పాటు చేసుకుని కుల వృత్తులు చేసుకుంటూ జీవిస్తున్న పోలవరం ముంపు బాధితులను గతంలో అధికారులు నిర్వహించిన పోలవరం సర్వేలో నిర్వాసితులుగా గుర్తించకుండా వదిలేశారు. రోడ్డుకు ఆవతలవైపు ఉన్న దుకాణ సముదాయాలను సర్వే చేసి పత్రికా నోటిఫికేషన్లో వారి పేర్లు వచ్చాయి. రోడ్డుకు ఇవతల వైపు ఉన్న చిరువ్యాపారులను గుర్తించకపోవడంతో నిర్వాసిత జాబితాలో వీరి పేర్లు రాలేదు. దీనిపై బాధితులు సర్వత్రా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా బార్బర్ షాపులు, ఇస్త్రీ షాపులు, చిన్న కూరగాయలు, పండ్ల దుకాణాలు, పాన్ షాపులు, కుట్టుమిషన్లు ఇలా చిరు వ్యాపారులు చేసుకుంటున్నారు. కొందరు 35 ఏళ్ల పైబడి, మరికొందరు 25 ఏళ్ల నుంచి ఈ స్థలంలో చిరు దుకాణాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇలా జీవిస్తున్న సుమారు 20 కుటుంబాలను ప్రభుత్వం నిర్వాసితులుగా గుర్తించకుండా వదిలేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రీ సర్వే చేసి తమను పోలవరం నిర్వాసిత జాబితాలో చేర్చి కులవృత్తులు చేసుకుని బతికే బడుగు బలహీన వర్గాలకు చెందిన తమకు పరిహారం అందించాలని వీరంతా కోరుతున్నారు.

ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నాం



ప్రతిరోజూ బట్టలు ఇస్త్రీ చేస్తేనే మా పొట్ట గడుస్తుంది. 20 సంవత్సరాలుగా ఈ వృత్తిని నమ్ముకొని ఇక్కడే జీవిస్తున్నాను. కాబట్టి మమ్మల్ని నిర్వాసితుల జాబితాలో చేర్చి పరిహారం అందించాలి.

- రేగుల బంధ లక్ష్మి, ఇస్త్రీ షాపు, చింతూరు.

మా వైపు షాపులను ఎందుకు సర్వే చేయలేదు



మా షాపులకు ఎదురుగా రోడ్డుకు అవతలవైపు ఉన్న షాపులను పోలవరం సర్వే వారు సర్వే చేసి నిర్వాసిత లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. కాని నా షాపుతో పాటుగా 20 షాపులను పోలవరం అధికారులు సర్వే చేయలేదు. ఎందుకని అడిగితే సమాధానం కూడా సరిగా చెప్పలేదు. మా షాపులు, సర్వే చేసిన షాపులు ఆర్ అండ్ బి స్థలంలోనే ఉన్నాయి. ఆ వైపు షాపులు చేసి మా వైపు షాపులను సర్వే చేయకపోవటం అన్యాయం.

- ఎం.లక్ష్మి, కూల్ డ్రింక్ షాపు, చింతూరు.

మమ్మల్ని ఆదుకోవాలి



కుట్టు మిషన్‌పై ఆధారపడి గత 38 సంవత్సరాలుగా ఈ స్థలంలోనే ఉంటున్నాను. పోలవరం నిర్వాసితులుగా మారిపోతున్న ఈ సమయంలో చేతి వృత్తి పనులు చేసుకుని బతికే మా కుటుంబానికి పోలవరం పరిహారం అందేలా సర్వే చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

- పొదిలి రామారావు, టైలర్, చింతూరు.

రీ సర్వే చేసి నిర్వాసితులుగా గుర్తించాలి



నా షాపుకు ఎదురుగా ఉన్న షాపులన్నీ పోలవరం సర్వే అధికారులు సర్వే చేసి పత్రికలో పరిహారం ప్రకటన ఇచ్చారు. కాని నా షాపు వైపు ఉన్న షాపులను సర్వేలు చేయకుండా, కనీసం కారణం కూడా చెప్పకుండా వదిలేయడం అన్యాయం. అధికారులు మళ్లీ రీ సర్వే చేసి మా షాపులన్నింటినీ పోలవరం పరిహారం జాబితాలో చేర్చాలి.

- మేడిశెట్టి శ్రీను, కూరగాయల దుకాణం, చింతూరు.

పోలవరం నిర్వాసితులకు తక్షణమే పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న నిర్వాసిత గిరిజనులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని గిరిజన సంఘం నాయకులు పాయం సీతా రామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తెల్లం తమ్మయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన గిరిజన సంఘం మండల కమిటీ సమవేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులకు పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ ఏడాది వచ్చిన మూడు గోదావరి వరదల వల్ల గిరిజనులు పంటలు సకాలంలో వేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు పండే పరిస్థితి లేదన్నారు. కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి తగిన సహాయం రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మడకం పొద్దయ్య, జ్యోతి, సొందే లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు



గర్భిణి బంధువులతో మాట్లాడుతున్న వైద్యురాలు

సిహెచ్‌సిలో గర్భిణులకు అందని వైద్యం

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సరైన వైద్యం అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని డి.భీమవరం పంచాయతీ మామిడిపాలెం గ్రామానికి చెందిన పొత్తూరు కృష్ణవేణి మొదటి కాన్పునకు 108 వాహనంలో అడ్డతీగల సిహెచ్‌సికి రాగా, ఆసుపత్రి వైద్యులు దుప్పులపాలెం పిహెచ్‌సికి తీసుకెళ్లకుండా ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. తమ ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేరు కాబట్టి డెలివరీ చేయడం ఇబ్బంది అవుతుందని, రంపచోడవరం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో చేసేది లేక 108 సిబ్బంది రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అడ్డతీగల ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడంలో జరుగుతున్న జాప్యంపై అధికారులు పర్యవేక్షించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గిరిజనులకు రేడియోలు పంపిణీ

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డిఎస్‌పి సురేష్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు రేడియోలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ సెకండ్ ఇన్ కమాండ్ సురేష్ బాబు, జీకే వీధి సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే పోలీసులకు ప్రజలు బాగా చేరువయ్యారని తెలిపారు. వారికి ఎటువంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులు వద్దకు వస్తున్నారన్నారు. సివిల్ యక్షన్ ప్రోగ్రాం ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. సీలేరు, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలో చింతపల్లి క్యాంప్, లైకన్ పూర్, చంద్రుర పల్లి, పార్వతి నగర్, బూసి కొండ, కాట్రగడ్డ, పిల్లిగెడ్డ గ్రామాల్లో 50 మంది గిరిజనులకు ఫిలిప్స్ రేడియోల పంపిణీ చేశారు. అనంతరం సివిక్ యాక్షన్ ప్రోగ్రాంకి హాజరైన ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఏపీ జెన్కో ఈఈ జాకీర్ హుస్సేన్, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు. ఏఈ కష్ణారావు, స్థానిక ఎస్ఐ రామకృష్ణ సీఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



రేడియోలు పంపిణీ చేస్తున్న సిఆర్‌పిఎఫ్, పోలీసు అధికారులు


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సునీత

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

సిపిఎం సర్పంచ్ పోరాటంతో నిధులు మంజూరు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని గసభ పంచాయతీ జంగిడి వలస గ్రామంలో పాఠశాలను కరోనా సమయంలో ఎత్తివేశారు. ఆ పాఠశాలలో చదువుతున్న గిరి విద్యార్థులు సుమారు రెండేళ్లపాటు విద్యకు దూరమయ్యారు. దీంతో ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత ఎత్తివేసిన ఆ పాఠశాలను తక్షణమే పునరుద్ధరించి గిరి విద్యార్థులకు విద్య బోధన కొనసాగించాలని గత ఏడాది ఆమె ఉపాధ్యాయురాలిగా అవతారమెత్తి, విద్యాబోధన సాగించారు. దీంతోపాటు ఎత్తివేసిన పాఠశాలను పునరుద్ధరించాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. దీంతో స్పందించిన అధికారులు జంగిడి వలస గ్రామంలో పాఠశాలను గత ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ ఏడాది నాడు నేడు పథకం ద్వారా పాఠశాల భవనాన్ని మంజూరు చేసి ప్రారంభించడంతో ఆ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసిన గసభ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాంగి సునీత మాట్లాడుతూ, నాడు నేడు నిధులు రూ.38లక్షలతో పక్కా భవనం నిర్మాణ పనులు జరుగుతాయని చెప్పారు. ఒక సంవత్సరం పొడవునా పాఠశాలలో ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించక పోవడంతో తానే స్వయంగా విద్యార్థులకు విద్యను బోధించానని ఈ సందర్భంగా సర్పంచ్ సునీత గుర్తు చేశారు. ఈ విషయంపై అనేక సందర్భంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి, మండల విద్యాశాఖ అధికారుల దృష్టిలో తీసుకుని వెళ్ళానని చెప్పారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఒక (సిఆర్టీ)కాంట్రాక్టు టీచర్‌ను తాత్కాలికంగా నియమించడం జరిగిందని, భవిష్యత్తులో పర్మినెంట్ టీచర్ నియామకం చేపట్టాలని అధికారుల దృష్టిలో తీసుకుని వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ వి సింహాద్రి, గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, వార్డుమెంబర్ పాంగి సత్యనారాయణ, మాజీ వార్డుమెంబర్ వంతల మొస్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

జగనన్న గృహాలు నిర్మించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: జగనన్న గృహ పథకం పేదలకు కన్నీరు మిగిల్చిందని జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, దురియా సాయిబాబ, కొన్నేడి లక్ష్మణరావు, అల్లంగి రామకృష్ణ, బి.రాందాస్ విమర్శించారు. ఆదివారం అరకులోయ మండలంలోని చినలబుడు పంచాయతీ హట్టగూడ, పెదలబుడు పంచాయతీ శరభగూడకాలనీలో జనసేన పార్టీ మండల నాయకులు సందర్శించారు. జగనన్న ఇళ్ల బాధితులతో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్పిన జగనన్న ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో గిరిజనలు ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొన్నేడి చిన్నారావు, జల్లేడి సంతోష్, సంతోష్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

దేవాపురం రోడ్డుకు మోక్షమెప్పుడో?

నిధులు మంజూరై రెండేళ్లయినా జరగని పనులు

100 గ్రామాల గిరిజనుల అవస్థలు


దేవాపురం రోడ్డు

ప్రజాశక్తి పాడేరు: మండలంలోని దేవాపురం రోడ్డు గోతులు పడి అధ్వాన్నంగా మారింది. గత మూడేళ్లుగా వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సుతో పాటు ఇతర వాహనాలు నడిపేందుకు రోడ్డుపై వీలుకాని పరిస్థితి నెలకొంది. మూడేళ్ల నుంచి బస్ సర్వీస్ కూడా నిలిచిపోయింది. దీంతో, ఈ ప్రాంతం లోని గిరిజనులకు రవాణా సేవలు కుంటుపడ్డాయి. 12వ మైలు జంక్షన్ నుంచి దేవాపురంకు 11 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం పిఎంజిఎస్‌వై కింద 2020 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 8 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణానికి అప్పట్లోనే పాడేరు శాసనసభ్యురాలు కే.భాగ్యలక్ష్మి శంకుస్థాపన కూడా నిర్వహించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు నేటికీ మొదలు కాలేదు. ప్రస్తుతం ఈ రోడ్డు దుస్థితి చాలా అధ్వాన్నంగా మారింది. ఆటో, బైకులపై వెళ్లే వారికి కూడా ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

ఇటీవల జిల్లా కేంద్రంగా మారిన పాడేరుకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ దేవాపురం ప్రాంతం నేటికీ మారుమూల ప్రాంతంగానే మిగిలిపోయింది. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడింది. దేవాపురం, అయినాడ, సలుగు, వంట్లమామిడి ఈ నాలుగు పంచాయతీల పరిధిలోని సుమారు 100 గ్రామాల గిరిజనులకు ఇదే ప్రధాన రహదారి. రెండు దశాబ్దాల క్రితమే దేవాపురంకు రోడ్డు సౌకర్యం ఏర్పడినా అభివృద్ధికి నోచుకోలేదు. అనేక ఫలసాయాల ఉత్పత్తికి కేంద్రంగా ఈ దేవాపురం ప్రాంతం ఏజెన్సీ లోనే ప్రసిద్ధికి ఎక్కింది. ఈ ప్రాంత గిరిజనులు అనేక రకాల ఫల సాయాల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా పైనాపిల్, సీతాఫలం, పనస, చింత తదితర ఫలసాయాలను విస్తారంగా పండిస్తూ ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ అధ్వాన రోడ్డుతో వాహనాలు తిరగక మార్కెటింగ్ చేసుకోలేక నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆటోలలో వీటిని రవాణా చేస్తూ అధిక వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నామని పలువురు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద గిరిజన రైతులు తమ పలసాయాలను కాలి నడకనే మోసుకుంటూ సంతలకు తెచ్చి అమ్ముకొని జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు ఎంతో ప్రయాసే మిగులుతుంది. వాహనాలు తిరగకపోవడంతో గిరిజన సహకార సంస్థ ద్వారా సరఫరా చేసే నిత్యావసరాలు సైతం పంపిణీ స్తంభిస్తోందని, సగం దూరంలోని పూల బంధ డిపో వరకే సరుకులు చేర వేస్తున్నారని పలువురు గిరిజనులు తెలిపారు. వాహనాలు తిరగక గృహ నిర్మాణ పనులు కూడా చేసుకోలేకపోతున్నామని, అంబులెన్సు తిరగలేని పరిస్థితితో ఆరోగ్య కేంద్రాలకు గర్భిణీలను కాన్పులకు తీసుకు వెళ్ళలేని పరిస్థితి ఉందని తెలిపారు. తమ రోడ్డు దుస్థితిని గుర్తించి ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే రోడ్డు పనులు

ఈ మార్గంలో ఆరు కిలోమీటర్లు రహదారి అటవీ ప్రాంతంలో ఉండడంతో అటవీ శాఖ ద్వారా అనుమతులు రావడంలో రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలిగింది. గత మే నెలలోనే అనుమతి ఉత్తర్వులు వచ్చాయి. త్వరలోనే రోడ్డు నిర్మాణం పనులు మొదలవుతాయని, ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నాం. డిసెంబర్ నాటికి రోడ్డు పనులు పూర్తిస్థాయిలో జరుగుతాయి.

రవికుమార్
డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

రాంబిల్లిలో రిబ్బన్ కంపెనీ

ప్రజాశక్తి-రాంబిల్లి : అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలో యమ ఇండియా రిబ్బన్ కంపెనీ నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ అనీల్ కుమార్, అనకాపల్లి ఎంపీ బీసెట్టి వెంకటసత్యవతి, యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకటరమణమూర్తిరాజు, చైనీస్ ఎంబసీ న్యూఢిల్లీ సెక్రటరీ యు యాంగ్, డబ్ల్యూయు జూన్ నిమి, ఎపిఐఐసి ప్రతినిధి ఎం.త్రినాధరావు, చైనా జనరల్ కాన్సులేట్ జహ లీయూ (కోల్‌కతా), యమ రిబ్బన్ ఇండియా డైరెక్టర్ స్టీవ్ హాజరై మాట్లాడారు. యమ రిబ్బన్ గ్రూప్ ప్రపంచంలోనే అతిపెద్ద రిబ్బన్లు, బౌస్ తయారీ సంస్థ అని తెలిపారు. రూ.300 కోట్ల పెట్టుబడితో 2000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. కొత్త యూనిట్‌లో ఎక్కువగా మహిళలే ఉంటారని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఉత్పత్తులను యుఎస్, యూరోపియన్ మార్కెట్‌కు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. కంపెనీ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు యమ ఇండియా కంపెనీ డైరెక్టర్ స్టీవ్ ధన్యవాదాలు తెలిపారు. 2023 డిసెంబరు నాటికి ట్రయల్ ఉత్పత్తిని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డైరెక్టర్ శివప్రసాద్, కంపెనీ మేనేజర్లు క్రాంతి కుమార్, శివ, జగన్, మోహన్, రవి, రామసురేష్, అశోక్, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ, కంపెనీ ప్రతినిధులు


సామగ్రిని అందజేస్తున ఎఎస్ఐలు

క్రీడా పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని వనభంగి పంచాయతీ దిగువ పెడాపల్లి గ్రామంలో యువ క్రీడాకారులకు ఆదివారం స్థానిక ఎఎస్ఐ పి.మనోజ్ కుమార్, ముంచంగిపుట్టు ఎఎస్ఐ రవీంద్రనాథ్ కుమార్‌లు క్రీడా పరికరాలు అందజేశారు. యువతకు వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర క్రీడా సామగ్రిని అందజేశారు.

వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ


వైద్యాధికారి జ్ఞానేశ్వరి

ప్రజాశక్తి-అనంతగిరి: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహించిన వైద్యా ధికారిణిలు బదిలీ కావడంతో ఆ స్థానంలో వేరే చోట విధులు నిర్వహించిన కె.జ్ఞానేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముంచంగ్‌పుట్ మండలంలో పని చేస్తూ బదిలీపై వచ్చారు. మరో వైద్యాధికారిని జాహనవి విధుల్లో చేరవలసి ఉంది. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ, ఆసుపత్రిలో అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

15న మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యాన ఈ నెల 15వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నాలుగు ప్రముఖ కంపెనీలతో 115 ఖాళీల భర్తీకి మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి, నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్యరెడ్డి, సీడాప్ జెడిఎం కల్యాణి తెలిపారు. ఇంటర్, బిఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమో కెమికల్, మెకానికల్, ఎనీ డిగ్రీ, ఎనీ బీటెక్, ఎనీ ఎంటెక్ చేసిన యువతీ యువకులు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. www.ncs.govt.in పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూకి హాజరు కావాలని తెలిపారు. కంపెనీల వివరాలకు http://shorturl.at/rR569 సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.13 వేలు నుంచి 20 వేలు మధ్య వేతనం ఉంటుందని తెలిపారు. అచ్యుతాపురం, గంభీరం, విశాఖపట్నం, గాజువాక ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలుకు 7386713880, 9000123483 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు శ్రీవారి కార్తీక మహా దీపోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : తిరుమల తిరుపతి దేవస్థానం, కార్తీక మహా దీపోత్సవం కమిటీ విశాఖపట్నం ఆధ్వర్యాన సోమవారం 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు రామకష్ణ బీచ్ కాళీ మాత అమ్మవారి గుడి ఎదురుగా సాగర తీర సమీపాన కార్తీక మహా దీపోత్సవం నిర్వహిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్వీబీసీ భక్తి ఛానల్ సిఇఒ షన్ముఖ్ కుమార్ తెలిపారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : విశాలాంధ్ర 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఆదివారం స్థానిక టర్నర్ సత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో సాహిత్యం, తెలుగు భాష, సంస్కృతి విస్తరణలో విశాలాంధ్ర చేసిన కృషి ఆమోఘం అన్నారు. అన్ని రకాల పుస్తకాలను ఒకే వేదికపై తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సంతలో అమ్ముడుపోని కూరగాయలు


కూరగాయలు అమ్మకానికి తెచ్చిన గిరిజన రైతు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు వారపు సంతకు ఆదివారం గిరిజన రైతులు తెచ్చిన కూరగాయలు అమ్ముడుపోకపోవడంతో వెలవెలబోయారు. దుప్పిలివాడ, పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, జొన్న మామిడి తదితర గ్రామాల నుంచి గిరిజన రైతులు కూరగాయలు సీలేరు వారపుసంతకు తెచ్చారు. ముల్లంగి, చిలకడ దుంపలు, బీన్స్ తదితర రకాల కూరగాయలు ఎక్కువగా రావడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో రైతులు తలలు పట్టుకున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా కూరగాయలు, ఆకుకూరలు పంటలు ఒకేసారి పండడంతోపాటు, భద్రాచలం సమీపంలోని కూనవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు కూరగాయలు తేవడంతో ఈ పరిస్థితి వచ్చింది. పండించిన పంటలు అమ్ముడుపోకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని విచారం వ్యక్తం చేశారు. తాము పండించిన పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి నేరుగా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, ఎడ్యుకేషన్ బృందం ఆధ్వర్యంలో జూపార్కులో విద్యార్థులకు పాపాహోమ్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా విద్యార్థులకు జూ పార్కులో ఉన్న జంతువులను చూపిస్తూ వాటి గురించి వివరించారు. జూ బయోస్కోపు మందిరంలో నిర్వహించిన జంతువులకు సంబంధించిన యాక్టివిటీలో డిఎఫ్ఒ అనంత శంకర్, క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా పాల్గొని ఫోటోలలో ఉంచిన వివిధ రకాల జంతువుల చర్మాలను గురించి వివరించి, విద్యార్థులతో చెప్పించారు. విద్యార్థుల కోసం ట్రెజరర్ హంట్ గేమ్ నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జంతువుల ఆకారంలో ఉన్న మాస్కలను, సర్టిఫికెట్లను, బహుమతులను అందజేసారు.

నేవీ మారథాన్‌లో కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం: విశాఖ బీచ్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన నేవీ మారథాన్‌లో ఆనందపురం కెజిబివి విద్యార్థినులు పాల్గొని పలు ప్రదర్శనలు ఇచ్చారు. నేవీ కమాండ్స్ విన్యాసాలలో భాగంగా భీమునిపట్నం కెజిబివి నుంచి 20మంది విద్యార్థులు, ఆనందపురం నుంచి 15 మంది, పద్మనాభం నుంచి 15 మంది మొత్తంగా 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నేవీమారథాన్ 5కె రన్‌లో పాల్గొని, ప్రతిభ చూపడం ద్వారా మెమెంటో, టీషర్టులను సాధించారు. నేవీ మారథాన్‌లోకస్తూర్బా పాఠశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించినందుక తూర్పు నావికాదళం అధికారులకు ఎసిపి శ్రీనివాసరావు, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి చంద్రకళ, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు

200మందికి గుండె పరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని చందక గ్రామంలో ఇండస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా గుండె వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎడ్ల బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మందికి వైద్యసేవలు అందించారు. ఇండస్ ఆసుపత్రి చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో అదే ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వి.సుజాత, డాక్టర్ ఎం నరసింహారెడ్డి, ఎం రమేష్ నాయుడు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి- కొయ్యూరు

కొయ్యూరు మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ శింగరాలపాడులో అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.26 లక్షలు కేటాయించారు. పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు 2018లో ఈ భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపులు జరగక నిలిచిపోయింది. ఈ విధంగా గతంలో నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న భవనాలు మండలంలో సుమారు 27 వరకు ఉన్నాయి. వీటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న భవనం

ముగిసిన న్యాయ చైతన్య వారోత్సవాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి తిరుమలరావు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ న్యాయ సేవలు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు వారాలపాటు నిర్వహించిన ప్రత్యేక న్యాయ చైతన్య కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. జిల్లా న్యాయ సేవా సదన్‌లో డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.తిరుమలరావు మాట్లాడుతూ, రెండు వారాల పాటు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో పలు విద్యాలయాల్లోనూ న్యాయ చైతన్య సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 'మత్తు పదార్థాలు విడనానండి సే నోటు డ్రగ్' నినాదంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించిందన్నారు. ఇందులో భాగంగానే జల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవివి బులికృష్ణ విశాఖ సెంట్రల్ జైలును సందర్శించి, ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు వారికి ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారన్నారు. అలాగే అరకులో రెండు వేల మందితో 'సే నో టు డ్రగ్' అంశంపై రెండు వేల మందితో ర్యాలీ చేపట్టామన్నారు. ముగింపు సందర్భంగా విశాఖలోనూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు బైపారుణ్ కుమార్, వివిధ న్యాయ కళాశాలల విద్యార్థులు, పారాలీగల్ వాలంటీర్లు, ప్యానల్ లాయర్లు, ధాత్రి స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందర్శకులతో పార్కులు కిటకిట


జూపార్కులో సందడి చేస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రెండో శనివారం, కార్తీకమాసం మూడవ ఆదివారం వరుస సెలవు దినాలు కావడంతో నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాల కొండ, ముడసర్లోవ పార్కులు సందర్శకులతో సందడిగా మారాయి. ఆదివారం ఉదయం నుంచి ఇటు హనుమంతువాక నుంచి జూ పార్కుకు వెళ్ళే రహదారులు, అటు హనుమంతువాక నుంచి అడివివరం వైపు వెళ్ళే బిఆర్‌టిఎస్ రోడ్డు ప్రయాణికులతో వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. ముఖ్యంగా జూపార్కుకు, కంబాల కొండ ఎకో టూరిజం, ముడసర్లో పార్కులు సందర్శకులతో కిటకిటలాడాయి. ఎక్కువ మంది కుటుంబ సభ్యులు, కుల సంఘాలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో గుంపులుగా పార్కులకు వచ్చి ఆట పాటలతో సరదాగా గడిపారు. ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలను ఆదివారం 19,159 మంది సందర్శించగా, రికార్డ్ స్థాయిలో రూ. 9.61 లక్షల ఆదాయం సమకూరిందని జూ అధికార్లు తెలిపారు.

సందడిగా ముడసర్లోవ పార్కు..

ముడసర్లోవ పార్కును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, కొన్ని మౌలిక వసతులు కల్పించడంతో ఈ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. చుట్టూ కొండలు మధ్యలో నిండికుండలా రిజర్వాయర్ పార్కు ప్రదేశం ప్రశాంతంగా ఉండడంతో నగర నలుమూలల నుంచి సందర్శకుల రావడంతో పార్కు సందడిగా మారింది.

ఆత్మీయ కలయిక..

నగరంలో లంకపల్లి బుల్లయ్య కళాశాల 1991-96 బ్యాచ్ విద్యార్థులు 26 ఏళ్ళ తరువాత మొదటిసారిగా ముడసర్లోవ పార్కులో ఆదివారం కలుసుకున్నారు. సినీనటుడు హర్ష పాత మిత్రులను కలుసుకుని వారితో సందడి చేశారు. **యాదవ మహిళా సంఘం ఆధ్వర్యంలో.** విశాఖ జిల్లా యాదవ మహిళా సంఘం ఆధ్వర్యంలో ముడసర్లోవ పార్కులో వనభోజన కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు పాల్గొన్నారు. మేయర్ స్వయంగా వడ్డించి సందడి చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పల్లా చిన్నతల్లి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎంపిపి చొరవతో స్థల సమస్యకు పరిష్కారం


అంగన్వాడీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి రమేష్

ప్రజాశక్తి-కొయ్యూరు

ఎంపిపి బడుగు రమేష్ చొరవతో మండలంలోని మంప పంచాయతీ పరిధి గంగవరం అంగనవాడీ కేంద్ర భవనం స్థల సమస్య పరిష్కారమైంది. ఈ స్థల సమస్యపై ఎంపీపీ బడుగు రమేష్ చొరవ తీసుకొని ఆదివారం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, విఆర్ఒ, గ్రామపెద్దలు, నాలుగు గ్రామాల ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభ స్థల సమస్యకు పరిష్కారం చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుల ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -తగరపువలస/ పద్మనాభం: రోడ్డు ప్రమాదంలో మరణించిన స్నేహితుడి కుటుంబానికి తోటిమిత్రులు ఆర్థికసాయంతో ఆపన్నహస్తమందించి అండగా నిలిచారు. ఆనందపురం మండలం, లొడగలవానిపాలేనికి చెందిన గుజ్జు మనోహర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు జివిఎంసి ఒకటో వార్డు, బంగ్లామెట్టకు చెందిన రెడ్డిపల్లి అప్పలరాజు, వాడపల్లి భాను ప్రసాదరావు, ఎద్దు అప్పలరాజు, ఎం సన్నిబాబు, ఎ.ధనరాజు, ఎన్ పద్మరాజు, పెంటయ్య తదితరులు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం వీరంతా లొడగలవానిపాలెంలోని మనోహర్ ఇంటికి వెళ్లి, అతని తల్లి, భార్యలకు అర్థికసాయం అందించారు. భవిష్యత్‌లోనూ అన్ని విధాలా అండగా ఉంటామని స్నేహితుడి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ఐఎంఎ విశాఖపట్నం బ్రాంచ్ కోశాధికారి మురళీమోహన్‌కు ఎపి కాన్ఫరెన్స్ అవార్డు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచ్ కోశాధికారి ఎంవివి.మురళీమోహన్‌కు ఐఎంఎ ఎపి కాన్ఫరెన్స్ అవార్డు దక్కింది. ఆదివారం నంద్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎం ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరాజు నుంచి మురళీమోహన్ అవార్డు అందుకున్నారు. మురళీమోహన్ సేవలకు గుర్తింపుగా అవార్డును అందజేస్తున్నట్లు ప్రకటించి, ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ రవికృష్ణ, సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఫణిధర్, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ పి.ఎ.రమణి, వైద్యాధికారులు పాల్గొన్నారు

మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో నిర్వహించిన 42వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు రాజ్యసభ సభ్యుడు జివిఎల్ .నర్సింగరావు ఆదివారం సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జివిఎల్ మాట్లాడుతూ, ఖేలో ఇండియా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సాహిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల నుంచి 390మంది 30 నుంచి వందేళ్లలోపు మాస్టర్ అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కె.నరసింగరావు, మాస్టర్స్ అథ్లెట్ల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి రామారావు, కార్యదర్శి పేర్ల సత్యారావు, ఉక్కునగరం మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, రోహిణి, పుష్పలత, భువనేశ్వరి పాల్గొన్నారు.